వైద్యుల సేవలకు సలాం

- ఎంతో మందికి పునర్జన్మనిచ్చిన దేవుళ్లు
- సరదాలను పక్కన పెట్టి రోగుల జీవితాలను నిలబెట్టిన మంచి వ్యక్తులు
- రేపు జాతీయ వైద్యుల దినోత్సవం


రోగికి వైద్యసేవలు అందిస్తున్న వైద్యుడు

రాయవరం: ప్రాణం పోసేది బ్రహ్మ అయితే పునర్జన్మ ఇచ్చేది వైద్యుడు. అందుకే వైద్యో నారాయణో హరి.. అంటే వైద్యుడిని కనిపించే దేవుడిగా భావిస్తారు. రోగికి ప్రాణం పోసి నిండు జీవితం ప్రసాదిస్తాడు. నాడి పట్టి..గుండె గుబులను గుర్తించి దిగులును దూరం చేసే వైద్యుడికి సమాజంలో గుర్తింపు ఉంది. వైద్యుని ఆత్మీయ స్పర్శ రోగికి అపర సంజీవనిగా ఉంటుంది. వైద్యుని ఆత్మీయ పలకరింపే సగం రోగాన్ని తగ్గిస్తుంది. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటూ ప్రమాదాల్లో పడిన జీవితాలకు పునర్జన్మనిస్తాడు. బతుకుతానన్న భరోసాను వైద్యుడు రోగికి కల్పించి, జీవితంపై ఆశను పెంచుతాడు. అంతటి విశిష్టత ఉన్న వృత్తిని స్వీకరించి, రాత్రనక, పగలనక పనిచేస్తూ రోగులు ప్రాణాలు నిలబెట్టడంలో జీవితాలను పణంగా పెడుతున్నారని చెప్పడంలో అతిశయోక్తి కాదు. రోగుల కళ్లల్లో ఆనందాన్ని నింపడం కోసం తమ వ్యక్తిగత జీవితాలను త్యాగం చేస్తున్న సందర్భాలు కోకొల్లలు. ప్రస్తుత రోజుల్లో వైద్యం వ్యాపారంగా మారుతుందన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలోనూ అంకిత భావం, సేవాభావంతో వైద్య వృత్తిని చేపడుతున్న వారికి కొదవలేదు. వైద్యరంగానికి, వైద్యుల సంక్షేమానికి సేవలందించిన డాక్టర్ బి.చంద్రరాయ్‌ను స్మరిస్తూ ఏటా జూలై ఒకటిన డాక్టర్స్ డే జరుపుకొంటున్నారు.

సమాజంలో గుర్తింపు

పవిత్రమైన వృత్తిలో ఉంటూ విశేష సేవలందిస్తున్న వైద్యులకు సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆహారం, వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా కొత్త కొత్త రోగాలు వస్తున్నాయి. భయంకరమైన వ్యాధులు వచ్చిన వారి వద్దకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులే భయపడుతుంటారు. అటువంటి రోగుల వద్దకు వెళ్లి ట్రీట్‌మెంట్ చేసేది కేవలం వైద్యులు మాత్రమే. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, చివరికి కూలీలకు కూడా సెలవులుంటాయేమో కాని డాక్టర్లకు మాత్రం తీరికే ఉండదు. పిల్లాపాపలతో గడిపేందుకు, కుటుంబ సభ్యులకు సమయం వెచ్చించేందుకు అవకాశాలూ తక్కువే. ఎమర్జెన్సీ కేసు వచ్చిందంటే ఎక్కడున్నా సరే పరిగెత్తి వెళ్లి రోగి ప్రాణాలను నిలబెడతారు. తన వ్యక్తిగత జీవితాలను కూడా త్యాగం చేస్తుంటారు.

నిత్యం వందలాది మందికి సేవలు

ఒకప్పుడు వైద్య సేవలు నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమయ్యేవి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాయి. కేవలం సాధారణ వైద్యులే కాకుండా వైద్య నిపుణులు సైతం మండల కేంద్రాలకు వచ్చి పనిచేస్తున్నారు. ముఖ్యంగా అన్ని రకాల ఆస్పత్రులు విస్తరిస్తున్నాయి. మల్టీ స్పెషాలిటీ సేవలు గ్రామీణ ప్రాంతాలకు చేరుతున్నాయి. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో రాయవరం, మాచవరం, అచ్యుతాపురం, వాకతిప్ప, అంగర, కపిలేశ్వరపురం, ద్వారపూడి, కేశవరం, పామర్రు, దంగేరు, పేకేరు, ద్రాక్షారామ, కుందూరులో పీహెచ్‌సీలు ఉండగా, మండపేట, రామచంద్రపురంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉంది. వీటి ద్వారా నిత్యం వేలాది మందికి వైద్యసేవలు అందుతున్నాయి.

వృత్తిలో తృప్తి



వైద్య వృత్తిలో తృప్తి లభిస్తుంది. రోగులకు వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నాం. ఇష్టంగా ఎంచుకున్న వృత్తిలో విజయాలు సాధించినప్పుడు కలిగే ఆనందం గొప్పది. ఒక్కోసారి కొన ఊపిరితో వస్తుంటారు. ఆ సమయంలో ఏ మాత్రం ఆలస్యం చేసినా ప్రాణం పోతుంది. 2019లో రాష్ట్ర కాయకల్ప అవార్డును, 2021లో బెస్ట్ వ్యాసక్టమీ సర్జన్‌గా అవార్డు అందుకున్నాను. కోవిడ్ సమయంలో 683 మంది పేషెంట్స్‌కు వైద్యసేవలందించాను.

– డాక్టర్ ఎస్.ప్రవీణ్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, రామచంద్రపురం

ఇంటింటికెళ్లి చికిత్స అందించా



కరోనా సమయంలో ఇంటింటికి తిరిగి చికిత్స అందించడం, ప్రతి ఒక్కరికి ధైర్యం కల్పించడం నా జీవితంలో మర్చిపోలేను. కరోనా పాజిటివ్ వచ్చిన వారి వద్దకు వెళ్లి భరోసా ఇవ్వడంతో పాటు వారికి కావాల్సిన మందులు, సలహాలు ఇచ్చాను. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత సర్వీస్‌లోకి వచ్చాను.

– డాక్టర్ వి.అనిరుధ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం

ఎన్నో సర్జరీలు చేశా



కార్డియాక్ సర్జన్‌గా గత రెండేళ్లుగా 2,500 వరకు సర్జరీలు చేశాను. ముఖ్యంగా పేద, మధ్య తరగతి రోగులకు సేవలందించడం చాలా సంతోషాన్నిస్తుంది. ఏరియా ఆస్పత్రిపై ఉన్న నమ్మకంతో పిఠాపురం, ఏలూరు, పాలకొల్లు, భీమవరం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడకు రావడం ఆస్పత్రిపై రోగులకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తుంది. నిత్యం వచ్చే పేద రోగులకు సేవలందించడం ఆత్మ సంతృప్తినిస్తుంది.

– డాక్టర్ కల్యాణ్‌బాబు, కార్డియాక్ సర్జన్, ఏరియా ఆస్పత్రి, రామచంద్రపురం

క్లుప్తంగా

టేకిలో జగన్నాథ రథయాత్ర


టేకిలో రథయాత్రలో భక్తులు

కపిలేశ్వరపురం: రాజమహేంద్రవరంలోని ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం టేకి గ్రామంలో శ్రీజగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహించారు. కృష్ణ కథాదేశ్ భక్తులు, గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో యాత్రలో పాల్గొన్నారు. జగన్నాథ స్వామి, సుభద్రమ్మ, బలభద్రుడులను భక్తులు దర్శించుకున్నారు. దేవతామూర్తులను కీర్తిస్తూ భజన పాటలతో రథయాత్ర గ్రామ వీధుల్లో కోలాహలంగా సాగింది.

2న మండల సమావేశం

కె.గంగవరం: వచ్చే నెల రెండో తేదీన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 2వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ సర్వ సభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు పంపన నాగమణి అధ్యక్షతన జరుగుతుందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయి నివేదికతో సర్వ సభ్య సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి 26 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం


మండపేటలో మొక్క నాటుతున్న చిన్నారులు

కపిలేశ్వరపురం (మండపేట): మానవ మనుగడకు అత్యవసరమైన పర్యావరణ హితాన్ని సాధించడం జమాఅతె ఇస్లామీ హింద్ లక్ష్యమని ఆ సంఘం అధ్యక్షుడు ఫారుఖ్, మహిళా విభాగం అధ్యక్షురాలు అయేషా జమీలా అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండపేట పట్టణంలో చిన్నారుల్లో నైతిక పరివర్తనను అలవర్చే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (సియో) జాతీయ స్థాయిలో రూపొందించిన కార్యాచరణలో భాగంగా ఆదివారం నుంచి జూలై 26 వరకూ పిల్లలకు పర్యావరణ అంశాలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా ఆదివారం ' మన చేతులు మట్టిలో – దేశం మదిలో' శీర్షికతో చెట్లను సంరక్షించుకోవాల్సిన ప్రాధాన్యతను వివరిస్తూ కార్యక్రమం చేపట్టారు. దైవ ప్రసాదితంగా చిన్నారులను భావించి వారిని శాంతియుత ప్రవర్తనతో కూడిన మానవ జాతి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన లక్ష్యాన్ని జమాఅతె సంస్థ నిర్దేశించుకుందన్నారు. కార్యక్రమంలో జమాఅతె సభ్యులు రిజ్వాన్, టీచర్ ఆలీ, సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కాంపిటీషన్‌లో తలాటం సిస్టర్స్ ప్రతిభ


విద్యార్థినికి సర్టిఫికెట్లు, నగదు బహుమతి అందజేస్తున్న చప్పిడి సతీష్ తదితరులు

రామచంద్రపురం రూరల్: బాలికల్లో చదువుతో పాటు పబ్లిక్ స్పీకింగ్ టాలెంట్‌ను ప్రోత్సహించేలా హోప్ హెల్పింగ్ హ్యాండ్స్ అండ్ బుక్స్ డొనేషన్ స్వచ్ఛంద సంస్థ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించింది. వక్తృత్వ పోటీల్లో పాల్గొని మండలంలోని వెలంపాలెం గ్రామానికి చెందిన తలాటం శ్రీసూర్యభవిత, తలాటం మాన్విత సిస్టర్స్ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలో హిందూ ధర్మంలో రాముడి నుంచి ఏమి నేర్చుకోవాలి అనే అంశంపై ఆన్‌లైన్ వీడియోలో మాట్లాడిన తలాటం భవిత మొదటి స్థానం కైవసం చేసుకుని ఈ మేరకు కాంపిటీషన్‌లో రూ.5 వేల నగదు, సర్టిఫికెట్‌ను సాధించగా, ఆమె సోదరి మాన్విత స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ గురించి మాట్లాడి రూ.516 కన్సొలేషన్ బహుమతి, సర్టిఫికెట్ సాధించింది. వీరికి ద్రాక్షారామలోని సూర్య హైస్కూల్‌లో సంస్థ అడ్మిన్ చప్పిడి సతీష్, దొడ్డా మణిస్వరూప్, కైరం తాతాజీల చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

రహదారికి అప్రోచ్ నిర్మించాలి


దంగేరు–శివల రహదారిలో అప్రోచ్ లేక ప్రమాదకరంగా ఉన్న వంతెన

కె.గంగవరం: మండలంలోని దంగేరు నుంచి శివల వెళ్లే రహదారిలో వంతెన వద్ద అప్రోచ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రోడ్డుకు అప్రోచ్ కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులు ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు అంటున్నారు. కనీసం ఇక్కడ గ్రావెల్ అయినా ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే అక్కడ అప్రోచ్ నిర్మించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్టు కమిషనర్ టీవీ రంగారావు ఆదివారం తెలిపారు. చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, 16 అంశాలతో కూడిన అజెండాపై కౌన్సిలర్లు చర్చించి తీర్మానాలు చేయనున్నట్టు కమిషనర్ రంగారావు తెలిపారు.

త్వరలో జాతీయ గణిత పోటీలు


బ్రోచర్ విడుదల చేస్తున్న సత్యనారాయణ తదితరులు

రామచంద్రపురం: పట్టణంలోని రామానుజన్ గణిత అకాడమీ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న జాతీయ గణిత పోటీల్లో భాగంగా 36వ జాతీయ గణిత పోటీలను ఈ ఏడాది సెప్టెంబర్, నవంబర్‌లో నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రకటించారు. సెప్టెంబర్ 21న ప్రిలిమినరీ పరీక్ష నవంబర్ 16న ఫైనల్ పరీక్ష దేశవ్యాప్తంగా నిర్వహించే పరీక్ష కేంద్రంలో జరుగుతుందన్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పరీక్షలో పాల్గొనే విద్యార్థులు గణిత అకాడమీని సంప్రదించాలని కోరారు. ప్రిలిమినరీ పరీక్షల్లో 10 శాతం విద్యార్థులు ఫైనల్ పరీక్షకు హాజరవుతారని ఫైనల్ పరీక్షల్లో మంచి ప్రగతి సాధించిన విద్యార్థులు డిసెంబర్ 21వ తేదీన జాతీయ స్థాయి గణిత పురస్కార మహోత్సవం, రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవం నాడు బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు. అవసరమైన ఓల్డ్ పేపర్ వాటి సాధనలు మెటీరియల్ మొదలగు రిఫరెన్స్ గ్రంథాలు అకాడమీ గ్రంథాలయంలో ఈ సందర్భంగా గణిత శాస్త్ర ప్రధాన విభాగం బీజగణితంపై వర్క్ షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 60 మంది గణిత ఉపాధ్యాయులు, గణిత వేత్తలు పాల్గొన్నారు. అకాడమీ ఎగ్జామ్స్ బ్రోచర్ విడుదల చేశారు. బీజగణితం హిస్టరీ, నూతన విశిష్ట గణిత సమస్యల సాధన మొదలగు విషయాలు వివరించారు. కార్యక్రమంలో రామానుజన్ గణిత అకాడమీ కార్యదర్శి ఎం.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఉన్నతే లక్ష్యంగా కృషి


మండపేటలో ఎమ్మార్పీఎస్ పట్టణ నూతన కార్యవర్గంతో నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): మంద కృష్ణమాదిగ నిర్దేశించిన మాదిగ సామాజిక ఉన్నతి లక్ష్య సాధన దిశగా తమ సంఘాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి డా.సామ్రాట్ కేబీ బిందు అన్నారు. మండపేట పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సంఘం సమావేశాన్ని నిర్వహించారు. సంఘం జిల్లా ఇన్‌చార్జి డా.సామ్రాట్ కేబీ బిందు, కో ఇన్‌చార్జి డాన్ సూరి, జిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధూళి జయరాజు, జిల్లా అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఎస్సీ వర్గీకరణ లక్ష్యాన్ని సాధించిన నేపథ్యంలో జులై 7న ప్రతి గ్రామంలోనూ ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేయాలని సమావేశంలో తీర్మానించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం పట్టణ కమిటీ ఇన్‌చార్జి గాలింకి నాగేశ్వరరావు, నాయకులు చింతర్తి హరీష్ కుమార్, ధూళి అన్నవరం, గూడాల ప్రసాద్ పాల్గొన్నారు.

మండపేట పట్టణ కమిటీలు ఎన్నిక

ఎమ్మార్పీఎస్ మండపేట పట్టణ అధ్యక్షుడిగా గోసాల వినయ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా గోడల ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గాలింకి చరణ్ తేజ, కార్యదర్శిగా అరిపెరాళ్ళ రవి కుమార్, సహాయ కార్యదర్శిగా అయినవిల్లి విజయకుమార్, కోశాధికారిగా శెట్టి నితిన్, ఎడ్యుకేషన్ విభాగం సభ్యుడిగా పాపగంటి చరణ్, కాకిలేటి ఆనందరావు, ఎమ్మార్పీఎస్ అనుబంధ ఎంఎస్పీ నూతన అధ్యక్షుడుగా తొత్తరమూడి సురేంద్ర, ఉపాధ్యక్షుడుగా పెనుముచ్చి కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా మోరంపూడి ప్రసాద్, కార్యదర్శిగా చాపల సతీష్, కోశాధికారిగా పలివెల సతీష్‌ను ఎన్నుకున్నారు.

ఉద్యోగ విరమణ పొందిన సరోజనికి సత్కారం


సరోజనిని సత్కరిస్తున్న ఎంపీపీ వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావుదొర తదితరులు

రాయవరం: స్థానిక పీహెచ్‌సీలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించిన ఎ.సరోజిని ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆమెను ఆదివారం ఘనంగా సత్కారించారు. రాయవరం పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ రమ్యశ్రీ అధ్యక్షతన నిర్వహించిన సత్కార సభలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావుదొర, ఎంపీపీ నౌడు వెంకటరమణ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్ల్యూ రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ సుధాకరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 33 సంవత్సరాలుగా సరోజిని అందించిన సేవలను వారు ప్రశంసించారు. అనంతరం సరోజినిని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది దుశ్శాలువా, పూలమాలలు, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, చాణక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి హరిప్రసాద్, మహిళా సెక్రటరీ వై.అనూరాధ, బేగం, రాయవరం, మాచవరం పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతే సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుధం


వైద్య విజ్ఞాన సదస్సులో పాల్గొన్న నిపుణులు

కపిలేశ్వరపురం: ఆధునిక జీవన పరిస్థితుల్లో అప్రమత్తం కావడమే సంపూర్ణ ఆరోగ్యానికి ఆయుధమని పారామెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సులో పాల్గొన్న వక్తలు అన్నారు. అంగరలోని శ్రావణి పోలీ క్లినిక్ ఆవరణలో నిర్వహించిన సదస్సులో రాజమహేంద్రవరానికి చెందిన జీవీఎస్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ గ్యాస్ట్రో వైద్య నిపుణులు డాక్టర్ రామ్‌గోపాల్ తేజ, న్యూరో సర్జన్ ఎ.శ్యామ్ సుందర్, గైనకాలజిస్ట్ డాక్టర్ బీఎస్ మాణిక్యాంబ(బాల) వారి విభాగాలకు సంబంధించిన నూతన వైద్య పద్ధతులపై పీఎంపీలకు అవగాహన కల్పించారు. పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైద్య నిపుణులు మాట్లాడుతూ ఆధునిక ఆహార పద్ధతుల కారణంగా జీర్ణాశయ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. అధిక రక్త పోటు, మధుమేహం, ధూమపానం, మద్యపానం వంటి ఆరోగ్య, సామాజిక సమస్యలకు దూరంగా ఉండడం ద్వారా పక్షవాతం నుంచి దూరంగా జీవించవచ్చన్నారు. గర్భకోశ వ్యాధులను ప్రాథమిక స్థాయిలో గుర్తించాల్సిన పద్ధతులపై వివరణ ఇచ్చారు. వారిని పీఎంపీలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, కార్యదర్శి సూరంపూడి వీరభద్రరావు, కోశాధికారి మట్టా వీరబాబు, రామచంద్రపురం, కె.గంగవరం మండల కమిటీల అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు, మేడిశెట్టి రామకృష్ణ, కార్యదర్శి పున్నం రాము, కోశాధికారులు గుబ్బల సత్యనారాయణ, ఎస్ సుబ్రహ్మణ్యం, సూరంపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

యుద్ధాల పేరుతో శాంతి లేకుండా చేస్తున్నారు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకరరావు

రామచంద్రపురం: సామ్రాజ్యవాద శక్తులు యుద్ధాల పేరుతో ప్రపంచ ప్రజలకు శాంతి సుఖమైన జీవితాన్ని లేకుండా చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగ ప్రభాకరరావు అన్నారు. సీపీఐ రామచంద్రపురం ఏరియా 18వ మహాసభ డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ పతాకాన్ని సీపీఐ సీనియర్ నాయకులు పెదపాటి నరసింహారావు ఎగురవేశారు. అధ్యక్ష వర్గంగా ఏఐటీయూసీ నాయకులు వి.గోపాలరావు, ప్రజానాట్యమండలి నాయకులు వి.రాంబాబు వ్యవహరించారు. ముందుగా మృతి చెందిన పార్టీ నాయకులకు, సభ్యులకు, సానుభూతిపరులకు సంతాపం తెలియజేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ముఖ్యఅతిథి డేగ ప్రభాకరరావు మాట్లాడుతూ దేశంలో గత సుమారు మూడున్నర దశాబ్దాలుగా నూతన ఆర్థిక సరళీకరణ విధానాల పేరుతో అంతర్జాతీయ, జాతీయ పెట్టుబడిదారీ శక్తులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని లొంగదీసుకుని వారి సంపదను పెంచుకోవడానికి అవసరమైన విధానాలు అమలు చేస్తున్నారన్నారు. ఉదాహరణకు 44 కార్మిక చట్టాలు రద్దు చేసి కార్మిక హక్కులు కాలరాయడం, రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలు, సామాజిక న్యాయం, ఆత్మగౌరవంతో బతకడానికి అండగా ఉన్న ప్రభుత్వం రంగ సంస్థలను ప్రైవేటు వారికి కారు చౌకగా అమ్మడం లాంటి దుర్మార్గమైన విధానాలను అమలు చేస్తున్నారన్నారు. అందువల్ల ఈ దేశంలో ప్రజల్లో వ్యతిరేకత వస్తుంటే, సమైక్యతతో కలసి మెలసి జీవిస్తున్న ప్రజల్లో మత విద్వేషాలు, కులతత్వాలు రెచ్చగొట్టి వారి పాలన కొనసాగిస్తున్నారన్నారు. త్యాగాలతో పునీతమైన భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులందరూ ప్రజలకు ఎదుర్కొంటున్న నిరుద్యోగం, అధిక ధరలు, దోపిడీ విధానాలలో వివరించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ చెలికాని స్టాలిన్ మాట్లాడుతూ పార్టీ సభ్యులందరూ సిద్ధాంతంపై అవగాహన పొందేటట్లు రాజకీయ శిక్షణ తరగతులు చేపట్టాలన్నారు. జూలై 19, 20, 21 తేదీల్లో అమలాపురంలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హంస అవార్డు గ్రహీతలైన గొర్రెల రాము ఏలూరు సరోజ, పశ్చిమగోదావరి జిల్లా సబ్బి కనకారావులకు అభినందన సత్కారాలు అందజేయటం జరుగుతుందన్నారు. ప్రజానాట్యమండలి కార్యకర్తలు, సభ్యులు కళాకారులు అందరూ కలసి ప్రజానాట్యమండలి జిల్లా మహాసభను జయప్రదం చేయాలన్నారు. సీపీఐ ఏరియా కార్యదర్శిగా పెద్దిరెడ్డి రాము, సహాయ కార్యదర్శిగా వి.రాంబాబు, 13 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఉపాధ్యాయురాలికి విద్యార్థుల సత్కారం


సావిత్రి టీచర్ దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ముప్పై ఏళ్ల క్రితం చదువు చెప్పిన టీచర్‌కు ద్రాక్షారామ పీవీఆర్ హైస్కూల్ 1994 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఇంటికి వెళ్లి ఘనంగా సత్కరించారు. ఇటీవల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా తమకు తెలుగు బోధించిన బాదం సావిత్రి టీచర్ దూరప్రాంతానికి వెళ్లడం వలన రాకపోవడంతో ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి సావిత్రి టీచర్, సత్యనారాయణ దంపతులను దుశ్శాలువా, పూలదండలతో సత్కరించి ఆత్మీయ సమ్మేళనం కానుక అందించారు. సావిత్రి టీచర్ మాట్లాడుతూ ఇన్నేళ్ల తర్వాత కూడా టీచర్లపై ఇంతటి గౌరవం చూపించడం గర్వంగా ఉందన్నారు. వచ్చిన పూర్వ విద్యార్థులందరికీ చిరు కానుకలు అందించి ఆశీర్వదించారు.

కౌలు రైతుల సదస్సును జయప్రదం చేయాలి


అవగాహన సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

కె.గంగవరం: ప్రస్తుతం చిన్న, సన్న, కౌలు రైతుల సమస్యలతో సతమతమతువున్నారని వారి సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 3న జరగబోయే అవగాహన సదస్సును జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు, ఐఎఫ్‌టీయు ఉమ్మడి జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం అన్నారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో ఆదివారం వారు సభను జయప్రదం చేయాలని కోరుతూ కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిన్న, సన్నకారు, కౌలు రైతుల సమస్యలపై వచ్చే నెల 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కె.గంగవరంలో బాలుర వసతి గృహం పక్కన సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి బాధిత రైతులందరూ హాజరు కావాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో కౌలు రైతుల రిజిస్ట్రేషన్, సంక్షేమ చట్టం (2011) ఉన్నప్పటికీ దాన్ని పూర్తిగా అమలు చేయడం లేదని వారు విమర్శించారు. ఈ చట్టం ప్రకారం కౌలు రైతులను గుర్తించి రుణాలు, పంట బీమా, నష్టపరిహారం, ప్రభుత్వ పథకాలు అన్ని అందుబాటులోకి తెలియాలని కానీ ఇప్పటికీ వేలాది మంది రైతులు గుర్తింపు లేక ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నారని వారు ఆవేదన చెందారు. ఈ సదస్సులో కౌలు చట్టం అమలుపై స్పష్టమైన తీర్మానాలు తీసుకొస్తున్నామని భవిష్యత్‌లో ఉద్యమం దిశలో చర్యలు ఉంటాయని వారు పేర్కొన్నారు. ఏఐకేఎంఎస్ రామచంద్రపురం డివిజన్ కమిటీ నాయకులు, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, రైతు కూలీ సంఘం నాయకులు రావి భాను, సుందరపల్లి అప్పారావు, జనిపెల్లి ప్రసాద్, ఖండవిల్లి శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి

కాజులూరు: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చెసి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ యువజన విభాగం కోఆర్డినేటర్ మాదిరెడ్డి పృథ్వీరాజ్ అన్నారు. యూత్ కమిటీల నియమాకంలో భాగంగా ఆదివారం గొల్లపాలెం, ఆర్యావటం తదితర గ్రామాల్లో పృథ్వీరాజ్ పర్యటించారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ఆరు నెలల కాలంలోనే కార్యరూపం దాల్చాయన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలతో పాటు ప్రజా అవసరాలకు అనుగుణంగా కొన్ని కొత్త పథకాలు ప్రవేశపెట్టి ఒక క్యాలెండర్ ప్రకారం సమయానుకూలంగా అన్ని పథకాలన్నీ అమలయ్యేవన్నారు. అయితే కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పేరుతో అరాచకాలు సృష్టిస్తూ సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేసేందుకు చూస్తుందన్నారు. కార్యక్రమంలో మండల యువజన విభాగం అధ్యక్షుడు పెంకే వెంకటరమణ, ఉపాధ్యక్షుడు నిమ్మితి విజయ్, మండల గ్రామాలకు చెందిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలి


అసంపూర్తిగా నిలిచిపోయిన కల్వర్టు నిర్మాణం

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం శివారు చీకట్లవారిపేటకు వెళ్లే రహదారిలో పంటకాలువపై ఉన్న కల్వర్టు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. బంధనపూడి రోడ్డు నుంచి చీకట్లవారిపేటకు వెళ్లేందుకు పంటకాలువపై కల్వర్టు లేకపోవడంతో 16 ఏళ్ల క్రితం గ్రామ పర్యటనకు వచ్చిన ప్రస్తుత ఎంపీ, అప్పటి ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ కల్వర్టు నిర్మాణానికి పంచాయతీ రాజ్ నుంచి రూ.లక్ష నిధులు మంజూరు చేశారు. నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కాలువపై శ్లాబ్ ఏర్పాటు చేసి దానికి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించకుండా వదిలివేశారు. రక్షణ గోడల కోసం ఏర్పాటు చేసిన ఊచలు బయటకు చొచ్చుకు వస్తూ ప్రమాద భరితంగా మారుతున్నాయి. వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి రక్షణగోడలు లేక కాలువలోకి బోల్తా పడుతున్నాయి. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పీర్ల ఊరేగింపు

రామచంద్రపురం రూరల్: మొహర్రం సంతాప దినాల నాలుగో రోజు ఆదివారం ద్రాక్షారామలో ఇమాం రజా పంజాలో లఖ్నవ్(ఫైజాబాద్) నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా మొహమ్మద్ షంసీ సాహెబ్ మజ్లిస్ ఆలపించారు. అనంతరం ఆజా ఖానయే జహరా పంజా నుంచి పీర్లను యా అలీ, యా హుస్సేన్ నినాదాలతో యువకులు, చిన్నారులు ఊరేగించారు. ద్రాక్షారామ, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అంజుమనే కమిటీల ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు.